# తర్కానికి లొంగని అనుభవం. . .

అసలు విజయం అనేమాటకి అర్థం లేదు; మనం ఎదురుచూసినది సఫలమవుతే విజయం అని అంటాం. 'ఇదేం లాభం లేదు, మనం ఓడిపోతాం!' అని అనుకుంటూ ఓడిపోతే అదీ విజయంకిందే లెక్క; నేను నా జీవితంలో తరచుగా అటువంటి 'విజయం' అనుభవించి ఉన్నాను.

నా జీవితాన్ని నిర్ణయించే ఒక ముఖ్యమైన పనిమీద నేను పక్కనేవున్న ఒక ఉరుకి వెళ్ళాను. ఎప్పటిలాగే 'ఇందులో నాకు అపజయమే దొరుకుతుంది' అనే అభిప్రాయంతోనే నా ప్రయాణం సాగింది. కాని దానికి విరుద్ధంగా నేను 'ఒడిపోయాను!' అంటే అపజయం నిశ్చయం అని అనుకున్న నా జీవితం పూర్తిగా మారిపోయింది!

నా కల్పనకి మితిమీరిన ఒక యువతిని నేను రహస్యంగా ప్రేమించాను. ఆమెను నేరుగా చూసి, సాహసంగా నా ప్రేమ వెల్లడించాలని, ఆమె నిరాకరిస్తే మరేం అనక సిగ్గుమాలిన మొహంతో అంగీకరించే ఉద్దేశంతో వెళ్ళాను. కాని ఏం ఆశ్చర్యం! యుగయగాలుగా నాకోసం కాచుకొని తపస్సు చేస్తున్న ధోరణిలో ఆమె సరే అనేసింది; నా ముద్దులకోసం పెదిమలు వొణుకుతూంటే ఆతురతతో నా భుజంపై వాలింది!

ఆ అపజయం, లేక ఆ విజయం నేను వెంటనే కొనియాడాలి! ఉరుకి తిరిగివెళ్ళిన తరువాత కాదు, ఇప్పుడే! నాకన్నీ వెంటవెంటనే జరగాలి . . .

కొనియాడడం అనే మాటకొస్తే అదేం పెద్ద పనికాదు; అంటే మన మనసుకి తగినట్టు అనుభవించడం అన్నమాట. అందువలన కలిగే బహిర్గత విషయాలేవీ ముఖ్యం కాదు. కొందరు పటాకీలు పేల్చి సంబరాలుగా కొనియాడతారు; మరికొందరు విందుభోజనాలతో ఆనందిస్తారు. అది వ్యక్తిగత పరిస్థితిపై ఆధారపడివుంటుంది; కాని మనస్సులో కలిగే అనుభవం అందరికీ ఒకటే . . .

ఇప్పుడు నా పరిస్థితి . . . జేబులోవున్నది ఒక రూపాయి నాణెం. అది చాలదా? ఊహూం, చాలదు! ఊరుకి తిరిగి వెళ్ళడానికి రైలు టికెట్టు పన్నెండణాలు; మిగిలింది పావలా . . . అది చాలదా? అది చాలు . . .

శంకరయ్యర్ హోటల్లో డిగ్రీ పాలు, డికాషన్, మితంగా పంచదారతో రెండణాలకి కాఫీ తాగినవెంటనే నాకు త్రాణ, బలం వచ్చినట్టనిపించింది. ఇక మిగిలిన రెండణాలు ఏం చెయ్యడం? 'చిట్టచివరకున్న చిల్లరనికూడా రాజులాగ ఖర్చుచెయ్!' అనే సామెతకూడా నాకు జ్ఞాపకం వచ్చింది.

"అయ్యా . . . ధర్మ దొర . . . కళ్ళులేని కబోది అయ్యా!" అనే కూత . . . స్టేషన్ కి వెళ్ళే దారిలో, ఒక మూల ఒక గుడ్డి పిచ్చగాడు కూర్చొనివున్నాడు; ముసలివాడు. వాడి ఎదుటవున్న చిన్న అలుమినియం గిన్నెలో కొన్ని ఇత్తడి నాణెలు కనిపించాయి. నేను వేసిన బేడ తెల్లధాళువుగా అందులో పడడంచూసి నేను ఆనందించాను. బిచ్చగాడు దాన్ని తీసుకొని, తడుముకుంటూ, నేను నడచివెళ్తున్నాననే భావనతో ఆ దారిని చూస్తూ, తన రెండు చేతులు జోడించి, "బాబూ, మీరు వెళ్ళే అన్ని మార్గాల్లోనూ మీకు పుణ్యం దొరుకుతుంది" అని నన్ను మనసార దీవించాడు; పావలాతో నేను ఆ రోజుని గొప్పగా కొనియాడాననే తృప్తి నా మనస్సులో నిజంగానే చోటుచేసుకుంది.

బుక్కింగ్ కౌంటర్ దగ్గరికివెళ్లి నేను వెళ్ళవలసిన ఊరుపేరు చెప్పి చిల్లర అందించాను; టిక్కెట్టు ఎదురుచూస్తున్న చెయిలో మళ్ళీ చిల్లరే వచ్చిపడింది.

"ఇంకో అణా ఇవ్వండి సార్!"

"టిక్కెట్టు పన్నెండణాలే కదా?"

"అది నిన్నటి వరకూ; ఇవాళనుంచి చార్జి ఎక్కువైంది."

చిల్లరతో నా చెయి బయటకి వచ్చేసింది. గభీమని అగాధంలో పడినట్టు నివ్వెరపాటు కలిగింది: 'ఒక అణాకి ఎవరిని అడగడం?'

'అదో, అక్కడ ఒక పెద్దాయన పేపరు చదువుతున్నారే, అతని దగ్గర . . . ఒక అణాపే కదా?' - అనే ఆలోచన రాగానే అడిగితే ఏమౌతుందని నాకు వెంటనే బోధపడింది. అతని దగ్గరకి ఎవడో వెళ్ళాడు; ఏదో అడిగాడు. అతని జవాబు లోకమంతా వినిపించింది, అది నాకూ కఠినంగా కనిపించింది. నేను రెండణాలు ధర్మం చేసి ఐదు నిమిషాలే అయ్యాయి; ఇప్పుడు ఒక అణా యాచించే నిర్బంధం నాకు వచ్చేసింది. మనస్సులోని తర్కవితర్కాలు ఎన్ని రకాలు!

‘అదో, ఆ అలుమినియం గిన్నెలో ఆ ఇత్తడి కాసులమధ్య నిగనిగలాడుతున్న ఆ బేడ నాకు సొంతం కాదా?’

‘అదెలాగ నీకు సొంతం? నువ్వు దాన్ని దానమిచ్చేసావు, వాడు నిన్ను దీవించేసాడు.’

‘ఇప్పుడు నా గతి ఏంకాను? అందులో ఒక అణా నాకు సొంతం కాదా? వాడి గిన్నెలోవున్నా అది నా డబ్బే కదా? అడిగితే ఇస్తాడా? ఇవ్వడా? ఆ బేడ నేనిచ్చానని వాడికి తెలియదే?’

‘అది దొంగతనం కాదా?’

‘దొంగతనమా? వాడికి ఎలాగైనా నా ధర్మం ఒక అణా దొరుకుతుంది. నాకా పుణ్యం చాలు; నా బేడ నేను తీసుకుంటాను!’ అని ఆర్థిక ధోరణిలో వాదించినా నా చెయి వొణుకుతూనేవుంది.

ఒకణా గిన్నెలో పడేసాను. ఆ బేడని తీసుకొని తిరిగాను.

“దుర్మార్గుడా! . . . ” నేను తిరిగి చూసాను. బిచ్చగాడి కళ్ళు నా మీద నిలకడగా పడ్డాయి. ఇంతకుముందు నన్ను దీవించిన నోరు ఇప్పుడు నన్ను శపించుతున్నట్టు అడిగాడు:

“అయ్యా, ఇదేం ధర్మం? ఎవరో ఒక పుణ్యాత్ముడు బేడ ఇచ్చారు. దాన్ని తీసుకొని ఒకణా వేస్తావా? . . . గుడ్డివాడిని మోసం చెయ్యకు . . . నరకంలో పడి చస్తావు!”

నిప్పుని తాకినట్టు వెంటనే చెయిలోని బేడని గిన్నెలో దులిపేసాను. ఇప్పుడు నా ధర్మం మూడణాలకింద లెక్క.

“తెలియక పొరబాటు చేసాను,” అని చెప్పినా కపటం వలన నా కంఠం వొణికింది.

ఒక అమ్మాయి ఒక పఅక వేసి, ఒక అణా తీసుకుంది; బిచ్చగాడు వెంటనే ఆ బేడవుందా అని తడుముకుంటూ మళ్ళీ ఖాయపరచుకున్నాడు.

వాడికి అది అక్కడ లేదు అని తెలిసినప్పుడే నేను చిక్కుకున్నాను; అది వాడికి ఎదురుచూడక దొరికిన భాగ్యం, దాన్ని కోల్పోవడమంటే ఎలాగ?

నేను మళ్ళీ ఆలోచించాను:

‘అది వాడి డబ్బా?’

‘అవును.’

‘నేనేగా ఇచ్చాను?’

‘డబ్బుని అప్పు ఇవ్వచ్చు; కాని ధర్మంని అప్పివ్వడం సాధ్యమా? ధర్మం కావాలంటే మనం ఒకరిని యాచించాలి, వాళ్ళు ఇస్తే పుచ్చుకోవాలి.’

నేను చాలాసేపు అక్కడే కాచుకొని నిలబడ్డాను. నేను వెళ్ళవలసిన రైలు వచ్చి, వెళ్ళిపోయింది. తరువాత వచ్చే రైలుకు చాలా సమయముంది. నా ధర్మం ఫలాన్ని తరువాత వచ్చే స్టేషన్ వరకూ నడుస్తూ, కాళ్ళు నొప్పుతూ, అనుభవించాను.

కొన్ని సంవత్సరాలముందు తమిళనాడులో జరిగిన ఒక రైలు  ప్రమాదం గురించి మీరు వినివుంటారు. అది నేను ఆ రోజు ప్రయాణం చెయ్యదలచుకున్న రైలే.

నేనెలా ఆ దుర్ఘటన నుంచి తప్పించుకున్నాను? నా ధర్మం నన్ను కాపాడిందా?

నాకు తెలియదు; ఇవన్నీ కర్మంకి లొంగే అనుభవాలు కావు.

********